# రాయలౌదార్యం

-జి. శ్రీదుర్గ

**"ఎవరది?" లోపలి గదిలో నుంచి వస్తూ తనను కలవడం కోసమని ముందు గదిలో వేచి వున్న ఆగంతుకుడిని ప్రశ్నించాడు ఆ వృద్ధుడు.**

**పట్టుబట్టలు కట్టుకుని మెడలో బంగారు ఆభరణాలు ధరించి ఉన్నాడు ఆయన. నుదుట గంధం, కుంకుమ ధరించి అప్పుడే దేవతార్చన ముగించి వస్తున్నట్టున్నాడు. మీద పడిన వయసుకంటే ఎక్కువగా ఏదో మనోవ్యథ వల్ల బాధ పడుతున్నవాడిలా ఉన్నాడు. ఆహార్యం ఐశ్వర్యాన్ని సూచిస్తున్నా ముఖమండలంలో ఒకనాటి తేజస్సు ఈనాడు కనబడడంలేదు. ఆయన కుడి పాదానికి కొట్టొచ్చినట్టు కనబడుతోంది రాజసం ఒలుకుతున్న గండ పెండేరం.**

**తన ఎదుట ఆసీనుడై ఉన్న ఆగంతుకుడిని పరిశీలనగా చూసాడు అల్లసాని పెద్దన. వచ్చిన ఆగంతుకుడు పెద్దన ప్రశ్న విని తన ఆసనం నుంచి లేచి "నమస్కారం" అన్నాడు. తన ఎదుట నిలుచుని ఉన్న ఎత్తయిన వ్యక్తిని చూడగానే అప్రయత్నంగా చేతులు జోడించాడు పెద్దన.**

చెయ్యెత్తు మనిషి. వయోభారంతో కాస్త ఒంగినట్లు కనబడుతున్నాడు. ఒకనాటి శరీర ధారుఢ్యం ఈనాడు కనిపించడంలేదు. ముఖం అవనతం చేయబడే ఉంది. తలపై వున్న పెద్ద తలపాగా నుదురుని కప్పేస్తున్నది. బాగా పెరిగిన గడ్డంతో అతని ముఖం స్పష్టంగా కనబడక పోయినా గొంతు విని అతన్ని గుర్తించాడు పెద్దన. ఆయన... ఆ సమయంలో తన ఇంట్లో... పెద్దన ఆశ్చర్యపోయాడు.

ఏ వ్యక్తి కనుసన్నలలో విజయనగర సామ్రాజ్యంలో ఎటువంటి పనైనా క్షణాలలో జరిగిపోయేదో, ఎవరి పేరు తల్చుకుంటే శత్రురాజులు విజయనగర సామ్రాజ్యలక్ష్మివైపు చూడడానికే భయపడేవారో, ఏ వ్యక్తి ధీశక్తి విశ్వవిఖ్యాతమై తెలుగు తేజానికి ఆచంద్రతారార్కం నిలిచే కీర్తి సంపాదించిందో, ఏ మేధావి శ్రీకృష్ణదేవరాయలను భారత చరిత్రలో చరితార్థుడిగా నిలిచిపోయేలా చేసాడో ఆ వ్యక్తి తన ముంగిట ఈనాడు... ఈ పరిస్థితిలో... ఇలా కనబడేసరికి పెద్దన నయనాలు అశ్రుపూరితాలయినాయి.

"అప్పాజీ! ఎంతకాలానికి మిమ్మలను చూడగలిగాను" అన్నాడు పెద్దన ఆదరంగా తిమ్మరుసు చేతులు పట్టుకుని. అన్నాడుగానీ అన్న మరుక్షణమే పశ్చాత్తాపపడ్డాడు. 'అయ్యో... చూడగలిగాను అని ఎందుకు అన్నాను. ఈ మహానుభావుడికి చూపులేదని, ఈయన చూడలేడు అని తెలిసి కూడా ఇలా అని ఆయన మనసు నొప్పించాను కదా' అని మధనపడ్డాడు మనసులోనే.

పెద్దన చేతులను తడుముతూ దగ్గరకు తీసుకుని "నాయనా! మిమ్మల్ని తాకితే నాకు రాయలను తాకినట్టే ఉంది. నన్ను చెర నుంచి విడుదల చేసినా బయటకు వచ్చి ఎవరినీ కలవడానికి మనసు రాక నా గృహంలోనే నన్ను నేను ఖైదు చేసుకున్నాను. ఇన్ని రోజుల తరువాత ఇక నా మనసు ఒపక్క కనీసం మిమ్మల్ని కలసి కొంత మనశ్శాంతి పొందుదామని వచ్చాను. మీరెలాగున్నారు నాయనా?" ఎంతో ప్రేమగా అడిగాడు తిమ్మరుసు.

ఆయన చేతులు తనను తడుముతూ ఉంటే ఆ స్పర్శకు పులకరించి పెద్దన మనసు రాయలు జీవించి ఉన్నప్పటి కాలానికి పరుగులు తీసింది. ఆయన అడిగిన ప్రశ్నతో ప్రస్తుతానికి వచ్చి "ఏముంది అప్పాజీ. నా ప్రభువు లేని ఈ జీవితంతో రోసిపోయాను. చావలేక బ్రతుకుతున్నాను జీవచ్ఛవమై" అన్నాడు గద్గదస్వరంతో.

"అవును నాయనా. పట్టాభిషేక పూర్వం నుంచి రాయలు నీ మిత్రుడు అని నేనెరుగుదును. ప్రభువైన తరువాత కూడా నీ సాంగత్యం విడిచి ఉండలేదు. అంతటి గొప్ప మిత్రుడివి, ప్రభువును కోల్పోయిన తరువాత జీవితం నిస్సారంగా కనిపించడం సబబేకదా" ఓదార్చుతూ అన్నాడు.

"మీరెలా ఉన్నారు అప్పాజీ?" కుశలం అడిగాడు పెద్దన.

"నాయనా! ఏమి చెప్పమంటావు? ఒకనాడు నేను అనుభవించిన వైభవం ఏది, నా ప్రభువుతోనే అన్నీ పోయాయి. ఇప్పుడు నా పేరు తలవడానికైనా ఈ పురజనులు ఇష్టపడతారా చెప్పు? లోక నింద చెవులబడితే ప్రాణం జివ్వుమంటుంది నాయనా. అది సహించలేక నేను నా గృహావరణ దాటి పురవీధులలోకి అడుగుపెట్టడానికి కూడా సాహసించలేక ఖైదీ జీవితమే మేలన్నట్లు గడుపుతున్నాను"

"బాధపడకండి అప్పాజీ. ప్రమాదో ధీమతామపి అన్నారు. పురాణ పురుషులకే కష్టాలు తప్పలేదు" అన్నాడు పెద్దన.

కొంచెంసేపు ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలింది.

తిమ్మరుసుని ఉచితాసనంలో కూర్చుండ చేసి తాను కూడా పక్కనే కూర్చున్నాడు పెద్దన. గృహాంతర్భాగంలో నుంచి ఒక పరిచారిక వచ్చి ఫలాలు, పానీయపాత్రలను అక్కడ ఉన్న నగిషీలు చెక్కిన బల్లపై పెట్టి వెళ్లింది.

పానీయాన్ని ఒక బంగారు లోటాలో పోసి తిమ్మరుసుకి అందించాడు పెద్దన "స్వీకరించండి అప్పాజీ" అంటూ.


కొద్దిగా ఆ పానీయం తీసుకుని పక్కనే వున్న బల్లపై పెట్టాడు తిమ్మరుసు. ఆయన తలపాగా నుదుటినే కాదు, గుంతలు పడినట్లున్న ఆయన కంటి భాగాన్ని కూడా కప్పి వుంది. 'పాపం' అనిపించింది పెద్దనకు.

కానీ అంతలోనే రాయలకు జరిగిన ద్రోహం గుర్తుకు వచ్చి కడుపు రగిలిపోయింది. రాయలకు లేకలేక కలిగిన ఒక్కగానొక్క పుత్రుడిని పొట్టనబెట్టుకున్న తిమ్మరుసు స్వార్థం గుర్తుకువచ్చి ఫలాలను కోయడానికి ఉపయోగించే కత్తిని తీసి తన ఎదుట కూర్చున్న ముదుసలి గుండెలలో దింపాలన్నంత వెర్రి కోపం క్షణకాలం కలిగింది.

'ఎంత దారుణం చేసాడు ఈ ముదుసలి. రాయలు తనకు వృద్ధాప్యంలో కలిగిన కొడుకుని తాను బ్రతికి ఉండగానే రాజుగా చూడాలని కోరుకున్నాడు. అదే ఆ పసివాడికి శాపం అయిపోయింది.

ఒకటిన్నర యేళ్లు మాత్రమే నిండిన ఆ పసివాడికి పట్టం కట్టి స్వయంగా తానే ప్రధాని బాధ్యతలు స్వీకరించాడు రాయలు. రెండునెలలపాటు ఎంత సంతోషంగా రాజ్యమంతటా వేడుకలు జరిపించాడు. ఎటు చూసినా సంతోషం తాండవమాడింది. వెన్నెలలు విరిసాయి.

అంతలోనే రాహువులాంటి తిమ్మరుసు స్వార్థం, చందమామలాంటి ఆ పసివాడిని గ్రహణంలా కమ్ముకుంది. క్రమేపీ క్షీణించిపోయాడు ఆ పసి రాజు. అంతు తెలియని వ్యాధికి గురై



అసువులు బాసాడు. ఆ బిడ్డడు చనిపోయాక కదా తిమ్మరుసు అతని కొడుకుతో కలసి చేసిన రాక్షస కృత్యం వెలుగు చూసింది. కంచే చేను మేసినట్లయింది. గర్భగుడిలో ఉంచిన శిశువుని ఆ దేవుడే సంహరించినట్లయింది. కలలో కూడా ఎవరూ ఊహించనిది జరిగింది. తిమ్మరుసు ఉన్నాడు, తనను కాచుకున్నట్లే తన బిడ్డను కూడా కాచుకుంటాడు అని రాయలు పెట్టుకున్న నమ్మకం వమ్ము అయింది. ఆ పని మరెవరైనా చేసినట్లయితే రాయలు ఆగ్రహం దారుణంగా ఉండేది. ఒకప్పటి అప్పాజీ కనుక బ్రతికిపోయాడు. కన్నులు మాత్రం తీయించి ప్రాణభిక్ష పెట్టాడు రాయలు. అయినా తిమ్మరుసు విశ్వాసఘాతుక చర్య మాత్రం విషమై రాయలకు మనోవ్యాధి కారకమైంది.

దానితోనే తీరని దుఃఖంలో మునిగి మరణించాడు తన ప్రభువు. కాదు, కాదు తెలుగు వల్లభుడు. అంతటివాడు అప్పటివరకు మరొకడులేడు. ఇకపై మరొకడు రాడు... ఆలోచనల సుడులలో పెద్దన మనసు ఎక్కడెక్కడికో పోతున్నది.

"నాయనా! మన ప్రభువు గురించి కాసేపు నీ మాటలు వింటే నా మనసు శాంతిస్తుందని వచ్చాను. ఒంటరిగా వున్నప్పుడు నా ఆలోచనలు రాయలువైపే సాగుతాయి. నాకంటూ ఎవరూలేని ఒంటరి జీవితం ఎంతో దుర్భరంగా ఉంది. రాయలు నాకు పెట్టిన ప్రాణభిక్ష నా పాలిట యావజ్జీవ శిక్షగానే పరిణమించింది. రాయల ఔదార్యం నేను భరించలేకపోతున్నాను నాయనా. దీనికంటే ఆనాడు వధ్య స్థలంలో నా కుత్తుక తెగకోసినా బాగుండేది నాయనా. ఏ సామ్రాజ్యం కోసం నేను నిరంతరం శ్రమించానో, ఏ ప్రజల కోసం నా సర్వశక్తులూ ఒడ్డి నిరంతరం కృషి సలిపానో వారే ఈనాడు నన్ను దుర్భాషలాడుతున్నారు. నయవంచనకు, విశ్వాసఘాతానికి నా పేరునే తలుస్తున్నారు. ఈ బాధ భరించలేకపోతున్నాను. నాలో రేగే బాధ నీతో పంచుకుంటే నా మనసు తేలిక అవుతుందని వచ్చాను నాయనా. రాయలకు నువ్వంటే ఎంతో అభిమానం. నీకు కూడా రాయలంటే ప్రాణం. అందుకే నీతో మాట్లాడితే రాయలతో మాట్లాడినట్లే ఉంటుంది నాయనా"

తిమ్మరుసు వేదనాభరితమైన మాటలు వినగానే పెద్దనకు క్షణం క్రితం వచ్చిన కోపం మటుమాయమైపోయింది. నాణానికి రెండవవైపు కూడా వుంటుంది అనే విషయం గుర్తుకువచ్చింది. ప్రజలలో రాయలను తప్పు పట్టే వారు కూడా ఉన్నారు.

తిమ్మరుసు తప్పు చేసాడంటే చాలామంది ప్రజలు విశ్వసించలేదు. ఎవరో పన్నిన కుట్రకు తిమ్మరుసు బలైపోయాడు అనీ, తిమ్మరుసు కళ్లు పెరికించి ఆయన కొడుకును చంపించిన తరువాత రాయలకు వారు నిర్దోషులని తెలిసి పశ్చాత్తాపపడ్డాడని కూడా జనులెందరో అన్నారు. ఆ మనోవ్యాధితోనే రాయలు మరణించాడని అన్నారు. రాయలకు అంత్యక్రియలు జరిగేటప్పుడు తిమ్మరుసు రాయలకు కన్నీటి వీడ్కోలు ఇవ్వడానికి కూడా తనను ఎవరూ తీసుకువెళ్లలేదని కుమిలిపోయాడని అన్నారు. తన ఎదురుగా దుఃఖంలో ఉన్న ముదుసలిని చూస్తే పెద్దనకు తిమ్మరుసు తప్పు చేయలేదేమో అని సందేహం కలిగింది. రాయలు పొరపాటు పడ్డాడా? ఏమో!

కొందరు రాయలు కృతఘ్నుడు అన్నారు, రాయలు అన్న వీరనరసింహరాయలు ఉబ్బు వ్యాధితో చనిపోయేముందు తన ఎనిమిదేళ్ల కుమారుడిని రత్న సింహాసనం ఎక్కించి అడ్డు అనుకున్న శ్రీకృష్ణదేవరాయలని చంపి గుర్తుగా అతని కళ్లు తీసుకురమ్మని తిమ్మరుసును ఆజ్ఞాపిస్తే రాజాజ్ఞను ఉల్లంఘనం చేసి తిమ్మరుసు రాయలను కాపాడాడు. రాజుకి మేక కళ్లు చూపి రాయలు చనిపోయాడని నమ్మించాడు. ఆ వార్త విని రాజు తృప్తిగా కన్ను మూసిన తరువాత రాయలకు పట్టాభిషేకం జరిపించాడు. అంత సాహసం చేసి కాపాడిన తిమ్మరుసుపై రాయలు కృతజ్ఞత చూపవలసిందిపోయి అతని కొడుకును చంపించి అతని కళ్లు పెరికిస్తాడా అని జనం నిందించారు.


అసలు నిజం ఎవరకు తెలుస్తుంది? ఆ భగవంతుడికి తప్ప! ఆ... మరొక్కరికి మాత్రం తెలుస్తుంది. తన ఎదురుగా ఉన్న అప్పాజీకి మాత్రమే తెలుస్తుంది. అడిగితే చెబుతాడా? ఏమో!



## డాగ్ ఫేషన్ షో

ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఇటీవల డాగ్ ఫేషన్ షో జరిగింది. దానిలో జూలియా అనే జూజపనీస్ స్పిజ్ క్లాస్ డాగ్ తన ఫేషన్‌బుల్ అలంకరణతో చూపరులకి ముచ్చటగొలిపింది.

-తటవర్తి



'ఏమైనా మాట్లాడు నాయనా''

"ఏమి చెప్పమంటారు అప్పాజీ! రాయలు గుర్తుకు రాని క్షణం ఉండదు. ఒకేసారి ఎన్నో మధురస్మృతులు మనసును పట్టి కుదిపేస్తాయి. నా ప్రభువు నేడు కానరాడంటే గుండె బరువెక్కిపోతుంది. నా యోగ్యతను మించి నాపై గౌరవం కురిపించాడు. ఎందరో మహీపతుల శిరస్సులపైన ఉండే నవరత్న ఖచిత కిరీటాలు ఆయన పాదాల చెంత ఉండేవి. అటువంటిది ఆ మహనీయుడు నిండు సభలో ఈ పేద బ్రాహ్మడి కాలికి గండపెండేరం తొడగడమేమిటి? పండితులకు రాజాశ్రయం లభించడమే పెద్ద విశేషం. కానీ ఇటువంటిని ఎప్పుడైనా విన్నామా కన్నామా.. న భూతో న భవిష్యతి''

కంఠం రుద్ధమై కొంచెంసేపు మౌనముద్ర దాల్చాడు పెద్దన. తిమ్మరుసుకి పెద్దన భావోద్వేగం అర్థమయింది.

ఆయన కూడా మౌనంగా ఉండిపోయాడు. కొంతసేపటికి కాస్త తేరుకుని మళ్లీ ఇలా అన్నాడు పెద్దన.

"గండపెండేరం ఒకనాటితో ముగిసే సన్మానం. కానీ రాయలు నన్ను ఒక్కనాడూ ఉపేక్షించలేదు. నడివీధిలో ఏనాడు నేనెదురైనా తన మదకరీంద్రమును ఆపి తన చేయి అందించి నన్ను ఆ గజరాజుపై ఎక్కించి తన సరసన కూర్చుండచేసేవాడు. ఎంతటి భాగ్యం నాది. కానీ ఆ రాజు వెళ్లిపోయి నేను ఈ భువిపై ఉండడమే నా దౌర్భాగ్యం''

మళ్లీ దుఃఖంలో మునిగిపోయాడు పెద్దన. చెమర్చిన కళ్లను, చెంపలపై ధార కట్టిన అశ్రువులను తుడుచుకోను కూడా ప్రయత్నం చేయలేదు. ఎవరు చూస్తారు ఆ అశ్రువులను? ఎదుట వున్నది తిమ్మరుసు ఒక్కడే. ఆయన చూడలేడు.

దీర్ఘంగా నిశ్వసించాడు తిమ్మరుసు.

"నాయనా! రాయలు నన్ను గుడ్డివాడిని చేసేడని అనుకుంటున్నావా? లేదు నాయనా.. అంతకుముందే నేను ఆ ధృతరాష్ట్ర పదవి స్వీకరించాను. అయోగ్యుడైన పుత్రునిపై మమకారం పెంచుకుని లోకహితం ఉపేక్షించే వారంతా ధృతరాష్ట్రులే కదా నాయనా. అలానే నేను కూడా.''

తిమ్మరుసు తనను తాను నిందించుకుంటుంటే సహించలేక "విధి బలీయం అప్పాజీ. జరిగిన దానికి నేను మిమ్మల్ని నిందించడంలేదు'' అన్నాడు పెద్దన.

"అది నీ ఔదార్యం నాయనా. రాయలకు ఉన్న గుణాలు అతనితో సన్నిహితంగా మెలిగిన నిన్ను ఆశ్రయించుకున్నాయి. కానీ ఒక ముఖ్యమైన విషయం నీకు చెప్పి నా మనసులోని బాధను నీతో పంచుకోవాలనుకుంటున్నాను నాయనా''

"చెప్పండి అప్పాజీ'' అన్నాడు పెద్దన, తిమ్మరుసు మనసుని బాధపెడుతున్న ఆ విషయం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో.

"నా కొడుకు కొంతకాలంగా పదవుల కోసం నన్ను వేధించేవాడు నాయనా. యోగ్యతను బట్టి పదవులు ఉండాలని నా సిద్ధాంతం. కానీ నేను అతనికి సరైన పదవిని ఇవ్వకపోవడానికి నాకు అతనిపై ప్రేమ లేకపోవడమే కారణం అన్నట్లుగా నన్ను వేధిస్తూ ఉండేవాడు. రాయలు స్వయంగా ప్రతిభాశాలి. కానీ నా కుమారుడు రాయలకు నేను నా మేధోశక్తితో రాజ్యాన్ని కట్టబెట్టానని, వాడికి కూడా అలాగే రాజ్యం కట్టపెట్టాలని కోరుతూ నన్ను పీడించేవాడు. రోజురోజుకి నాపై వాడు వత్తిడి పెంచసాగాడు. కన్నకొడుకుపై తెంచుకోలేని మమకారం వలన నేను వాడికి ఏవో పదవులు కట్టబెట్టాను. అయినా వాడు తృప్తి చెందలేదు.''


తిమ్మరుసు మనసులో ఎప్పటినుంచో దాగుకుని వున్న ఆ మాటలు మొదటిసారి వింటున్న పెద్దన ఆశ్చర్యపోయాడు 'ఇంత ప్రతిభాశాలి తన కుమారుడిని మంచి దారిలో పెట్టలేకపోయాడా?' అని.

"రాయలుతో కూడా నేను నా కుమారుడి గురించి చాలాసార్లు చెప్పాను. కానీ వాడి పదవిని మీరి వాడు ప్రవర్తిస్తున్నా నామీద వున్న గౌరవంతో రాయలు వారించలేదు. అలా వాడు నేను చెప్పని అధికారాలను కూడా తనకు తానే అందిపుచ్చుకుని అంతఃపురంలో పలుకుబడి పెంచుకున్నాడు. వాడి రహస్య చర్యలను నేను గమనించినా నా ధృతరాష్ట్ర పదవివ



## అనుష్క తెలివి!

'సింగం' ఘన విజయంతో తమిళనాడులో అనుష్క డిమాండ్ అమాంతం పెరిగిపోయింది. ఆమెను తమ చిత్రాల్లో హీరోయిన్‌గా బుక్ చేసుకోవడానికి నిర్మాతలు పోటీ పడుతున్నారు. కానీ ఎందుకనో తమిళ చిత్రాల్లో నటించేందుకు అమష్క అంతగా ఆసక్తి చూపడంలేదని సినీ జనాలంటున్నారు. అక్కడ సినిమాల్లో నటించేకన్నా కూడా పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని రెండు చేతులా సంపాదిస్తేనే లాభమనుకుంటోంది అనుష్క. ప్రస్తుతం పలు వస్త్ర దుకాణాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా అనుష్క వ్యవహరిస్తోంది. సినిమాల్లోకన్నా అనుష్కకు ఇదే లాభసాటిగా వుందేమో!




లన పెదవి విప్పలేకపోయాను.

చివరకు రాయలకు పుత్ర సంతానం కలిగినప్పుడు వాడిలో కలిగిన ఆశాభంగం గమనించినప్పుడు నాకు అర్థమయింది, నా ఇంట్లోనే నేనొక రాజద్రోహికి ఆశ్రయమిచ్చానని. ఎంతో ప్రయత్నించాను వాడిలో చెడు తలపులు రాకూడదని. మారినట్లే కనిపించాడు. కానీ గుట్టుగా ఉన్నాడు, తన మనసులోని విషయాలు నాకు చెప్పకుండా. అప్పటికి వాడు తన కంటూ కొంత ప్రాభవాన్ని పెంచుకున్నాడు.''



## నిర్ణయించేది ప్రేక్షకులే!

చాలామంది నటీనటులకు ప్రేక్షకుల మధ్యన కూర్చుని సినిమా చూస్తూ వారి ప్రతిస్పందన ఎలా వుంటుందో తెలుసుకోవాలన్న కోరిక వుంటుంది. కానీ అది సాధ్యపడే విషయం కాదు కదా. ఈ విషయమే నయనతార మాట్లాడుతూ 'నాకైతే ఇంట్లో సినిమా చూడడం కన్నా ప్రేక్షకుల మధ్యన కూర్చుని చూడడమే ఇష్టం. ఎందుకంటే మన పాత్రను సమర్థవంతంగా పోషించామా లేదా అన్నది నిర్ణయించేది ప్రేక్షకులే కదా. అందుకే సాధ్యమైనంతవరకూ నేను నటించిన చిత్రాలను చూడడానికి థియేటర్లకు వెళ్లడానికే ఇష్టపడతాను' అంటోంది నయనతార.




ఊపిరి బిగబట్టి ఆలకిస్తున్నాడు పెద్దన. తిమ్మరుసు తనకు అంతఃపుర రహస్యాన్ని చెప్పబోతున్నాడని శ్రద్ధగా వినసాగాడు.

"రాయలు తన కుమారుడి పట్టాభిషేకం తలపెట్టినప్పుడు నా మనసు కీడు శంకించింది. రాయలను వారించాలని చూసాను కానీ నా మాట ప్రభువు పెడచెవిన పెట్టాడు. నా రక్షణలో ఆ పసివాడు ఉండగా ఏ శత్రువు తేరిపార చూడడానికి కూడా సాహసించడని అభిప్రాయపడ్డాడు.''

ఆ మాటలు అంటున్నప్పుడు తిమ్మరుసు కంఠం ఒణికింది. ఒక క్షణ మాత్రం ఆగి మరలా కొనసాగించాడు.

"ఆ పసివాని బాధ్యత నేను ఎంతో జాగ్రత్తగా తీసుకున్నాను. కానీ నా కొడుకు నా కన్నుకప్పి బిడ్డపై విషప్రయోగం జరిపించాడు. బిడ్డకు అందే ఆహారాన్ని వంటవాళ్లతోనూ, వడ్డించేవాళ్లతోనూ ముందు తినిపించేవాడిని. కానీ ఆ బిడ్డకు నేను ఊహించని విధంగా విష ప్రయోగం చేసాడు నా కుమారుడు.

అదెలాగో తెలుసా నాయనా...బిడ్డ ధరించే వస్త్రాలపై విషాన్ని చిలకరింపజేసేవాడు. ఆ పసివాడికి అప్పుడప్పుడు తన నోటిలో చేతివేళ్లను పెట్టే సహజ గుణంవలన ఆ వస్త్రాలకు ఉన్న విషం అతని దేహంలోని ప్రవేశించేది. ఆ విధంగా ఆ పసివాడు వ్యాధికి గురయ్యాడు. నేను ఆ విషయం కనిపెట్టేలోపలే జరగకూడని ఘోరం జరిగిపోయింది. బిడ్డ దేహంలో విషం మోతాదుని మించిపోయింది.''

ఊపిరి స్తంభించిపోయినట్లయింది పెద్దనకు. తండ్రిని మించిన తెలివితేటలు ఉన్నా తప్పుదారిలోకి వెళ్లి సర్వనాశనం చేసిన తిమ్మరుసు కొడుకును తలచుకుని నిశ్చేష్టుడయ్యాడు.

"ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా ఆ బిడ్డ మరణానికి నేనే కారణం. అందుకే ఆ బిడ్డ మరణానికి ఎవరు కారణం అని రాయలు నన్ను అడిగినప్పుడు అదే చెప్పాను. అంతేకాదు, మా ఇద్దరికీ శిరచ్ఛేధం చేయమని కూడా చెప్పాను. అంత దుఃఖంలో కూడా నాకు, నా కుమారుడికి హాని చేయడం రాయలకు ఇష్టం లేకపోయింది అంత ఔదార్యం ఆ ప్రభువుకి. మా ఇద్దర్నీ ఖైదు చేయించాడు అంతే.

అంత జరిగిన తరువాత కూడా నా కుమారుడు అంతఃపురంలో తనకు ఉన్న మద్దతుని ఉపయోగించుకుని చెర నుంచి తప్పించుకున్నాడు. నన్ను కూడా తప్పించాలని చూసాడు. నేను తిరస్కరించాను'' స్థిరమైన కంఠంతో చెప్పాడు అప్పాజీ.

"తప్పించుకుని పారిపోయిన నా కుమారుడు కొంత సైన్యాన్ని కూడగట్టుకుని రాయలుపై తిరుగుబాటుకు పథకం వేసాడు. రాయలు వాడిని పట్టించి తెచ్చి మా ఇద్దర్నీ వధ్య స్థలానికి పంపించినప్పుడు నాకు అనిపించింది, రాయలు నేను ఇచ్చిన సలహా పాటించి మా ఇద్దరికీ మరణదండన విధిస్తాడని. విధి నిర్వహణలో ఒకే ఒక్కసారి నేను ఓడిపోయాను నాయనా. అందుకు నాకు తగిన దండన దొరుకుతుందని అనుకున్నాను. ఎందుకో ఈ అప్పాజీపై రాయలకు అంతులేని ప్రేమ. నన్ను కనికరించి ప్రాణాలు తీయవద్దని, కళ్లు పెరికించమని ఆజ్ఞాపించాడు.

'మరణం కంటే పెద్ద శిక్ష విధిస్తున్నాడు నాకు' అని సర్దిచెప్పుకున్నాను. అవమానభారంతో ఎవరూలేని ఒంటరి జీవితంతో క్షణక్షణం చస్తూ ఉండాలి. సరేలే నా పాపానికి ఇదే సరైన శిక్ష అనుకున్నాను.

వధ్యస్థలంలో నా కుమారుడికి శిరచ్ఛేధం జరిగినప్పుడు నా కళ్లల్లో ఒక్క కన్నీటి బొట్టు కూడా రాలేదు.

తలారి నా దగ్గరకు ఒక చిన్న పేటికను తెచ్చి ఉంచాడు. నా కళ్లు అందులో పెడతాడుకదా అనుకున్నాను. ఒక చేత చురకత్తి ఎత్తి నా కంటి

దగ్గర పెట్టి రెండవ చేతితో నా కంటి దగ్గర పట్టి వుంచి 'ఏలినవారి ఉత్తర్వు పాటిస్తున్నాను' అంటూ లాఘవంగా ఆ కత్తిపై రాసి వున్న కాటుక నా కంటిపై రుద్దాడు.

అప్పుడు చిందిన రక్తం నా చెంపలను తడిపింది. ఆ రక్తం తలారి తన చేతికి కత్తితో చేసుకున్న గాయంనుంచి స్రవించింది. నా రెండు కళ్లకు కాటుక రుద్ది, రక్తం పూసి 'ఏలినవారి ఆజ్ఞ. తమరు ఈ విషయం పెదవి దాటనీయరాదు' అన్నాడు. వాడు తెరిచిన పేటికలో రెండు కళ్లు కనిపించాయి. అవి మేక కళ్లేమో...''

పెద్దన తాను విన్న మాటలు నమ్మలేకపోయాడు. రాయలు తనకు లేక లేక కలిగిన కొడుకు పోయిన దుఃఖం అనుభవిస్తూ కూడా అప్పాజీపై తన కున్న ప్రేమను, గౌరవాన్ని అలాగే పదిలపరచుకున్నాడు. ప్రభువు ఎంత సంఘర్షణ అనుభవించి ఉంటాడో కదా. కానీ ఎంత ఉన్నతమైన మానవత్వాన్ని ప్రదర్శించాడు. పెద్దన మనోనేత్రంలో రాయలు మునుపటికంటే ఎంతో ఉన్నతంగా ప్రకాశించాడు.

"అప్పాజీ! తమరు చూడగలరా? తమరి కళ్లు అలాగే ఉన్నాయా?'' సంతోషం, ఆశ్చర్యం ఒక్కసారిగా పలికిస్తూ అన్నాడు పెద్దన.

జరిగినదంతా అప్పాజీ నోట విన్న పెద్దనకు రాయలు, అప్పాజీ ఒకరికొకరు తీసిపోని అపూర్వ జంటగా తోచారు. కృష్ణార్జునుల్లా, నరనారాయణుల్లా వారికి వారే సాటి. ఉదాహరణకు కూడా అటువంటి మరొక జంట లోకంలో కానరాదు.

తన తలపాగాను కొంచెం వెనక్కు జరుపుకుని పెద్దన వైపు చూసాడు అప్పాజీ. తల్లిని కావలించుకుంటున్న చిన్నపిల్లాడిలా అప్పాజీని గట్టిగా కావలించుకున్నాడు పెద్దన.

అతని కళ్లు ఆనందభాష్పాలను వర్షిస్తున్నాయి.

కొన్ని క్షణాలు ఆ ఆనందాన్ని ఇరువురూ అనుభవించారు. అప్పుడు అప్పాజీ ఇలా అన్నాడు.

"నాయనా! నీనుంచి కావాల్సిన పని ఒకటి ఉంది చేస్తావా?'' అడిగాడు.

"తప్పకుండా అప్పాజీ. మీరు ఆదేశించండి'' అన్నాడు పెద్దన 'ఆ పని ఏమిటి?' అని కూడా అడగకుండా.

రాయలు అక్కడ ఉంటే ఆ మాటే అనేవాడు. అప్పాజీపై రాయలకు ఉన్న నమ్మకం అటువంటిది.

"రాయల మరణానంతరం కృష్ణా నది ఒడ్డున గజపతుల సేనలు పొంచి ఉన్నాయి. అదను చూసి దండెత్తవచ్చు. కానీ గజపతులు పూరీ జగన్నాథుని కొలిచే దైవభక్తులు. వారికి పాపభీతి ఉంది. నువ్వు రాయలకు అనధికార ప్రతినిధివి నాయనా. నీ మాటకు రాయల మాటకు ఉన్నంత విలువ వుంటుంది. నువ్వేమి చేస్తావో చెయ్యి. ఆ గజపతులు తమ ప్రయత్నం విరమించుకోవాలి. అంతే నేను కోరుకునేది'' అన్నాడు అప్పాజీ.

ఆ ప్రభుభక్తికి, ఆయన దేశభక్తికి శిరస్సు వంచి నమస్కరించాడు పెద్దన. ఆయన నోటి వెంట ఆశువుగా ఒక పద్యం వెలువడింది.

"రాయరావుతుగండ రాచయేనుఁగు వచ్చి
యార్లకోటఁగోరాడునాఁడు
సంపెట నరసాల సార్వభౌముఁడు వచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చునాడు
సెలగోలు సింగంబు చేరి ధిక్కృతి గంచు
తలుపులఁగరుల డీకోలునాఁడు
ఘనతరనిర్భర గండపెండెరమిచ్చి
కూఁతు రాయలకును గూర్చునాఁడు
నొడలెరుంగవో-చచ్చితొ-యుర్విలేవొ
చేరఁజాలక తలచెడి జీర్ణమైతొ
కన్నడంబెట్లు చొచ్చెదు గజపతీంద్ర
తెరిచి నిలుకుక్క చొచ్చిన తెరగుదోఁప''

ఆ పద్యం జాబు రాసి గజపతికి తన సందేశంగా పెద్దన పంపాడు. అది చదువుకున్న గజపతి సిగ్గుపడి తన సైన్యాన్ని ఉపసంహరించుకున్నాడు.

★



## ప్రాణం తీసిన పందెం

'గులామ్' సినిమాలో అమీర్‌ఖాన్ తన ప్రత్యర్థులతో పందెం కాసి రైలుకి ముందుగా స్పీడుగా పరుగెత్తే సీనుని వాస్తవ జీవితంలో కొందరు యువకులు ప్రయత్నించారు. ఇటీవల జలపాయగురీ స్టేషన్ బయట నలుగురు ఈ విన్యాసం చేయబోతే ముగ్గురు సాధించగలిగారుగానీ 18 సంవత్సరాల సమ్రాట్‌కుండు అనే యువకుడు గమ్యం చేరేలోగా వెనుకనుంచి స్పీడుగా వచ్చిన రైలు అతని మీద నుంచి వెళ్లిపోయింది. నిజ జీవితంలో ఇలాంటి ఆటలు ఆడకండి, ప్రమాదమని ఎన్నిసార్లు మొత్తుకున్నా ఈ కుర్రకారు వినరు. తల్లిదండ్రులకు కడుపు శోకం మిగల్చక మానరు.

-తటవర్తి

